
**నిలువుటద్దం** ముందు నిలబడి అలంకరించుకుంటోంది సుజన. పొలం నుంచి భర్త ఇంటికి వచ్చే వేళ అయింది. వంటచేసి సిద్ధంగా ఉంచింది. వేడినీళ్ళు పొంతకుండలో మసలుతున్నాయి. అంతలో వీధిలో ఆడదాని ఏడుపు వినిపించింది. గుండె గుభిల్లుమంది సుజనకి! ఆ వీధిలోనే కాదు; ఆ ఊళ్ళో-ఆ దేశంలో—ఆడదాని ఏడుపు అతి సామాన్య మయిపోయింది. ఏ రోజు, ఏ ఇంట్లో, ఏ ఆడదానికి మూడుతుందో ఎవరూ ఊహించలేక పోతున్నారు.

"ఊఁ... నడు. నా ఇంట్లో ఒక్కక్షణం ఉండటానికి వీల్లేదు!" ఏడుస్తున్న భార్యని జుట్టు పట్టుకుని బయటికి ఈడుస్తూ తంతున్నాడు భర్త.

"నా తప్పు ఏముందండీ? ఈ ఊళ్ళో పెద్ద గూండా సర్వభక్షకుడు మీ కళ్ళముందే మన ఇంట్లోకి జొరబడ్డాడు. రాకుండా ఆపగలిగారా? మీ అందరిముందూ నన్ను గదిలోకి లాక్కుపోయి తలుపులు వేసుకున్నాడు. ఒక్కరు...ఒక్కరైనా అడ్డుకున్నారా? ఇప్పుడు నన్ను తన్ని బయటికి గెంటుతున్నారే... నే నెలా బ్రతకాలి? చెడిపోయానని ముద్రవడ్డ న న్నెవరు రానిస్తారు?" గోడుగోడున ఏడుస్తోంది భార్య.

"పాపిష్ఠిదానా! ఆడదానికి ప్రాణంకంటె శీలం ప్రధానం! సర్వ భక్షకుడు నిన్ను పాడుచెయ్యక ముందే నీ తల గోడకి బాదుకుని చావవలసింది.. ఇప్పుడైనా చావు! ఇంత కళంకంతో బతకటానికి సిగ్గులేదూ?" చీదరించుకుంటూ బయటికి ఈడుస్తున్నాడు భర్త-మగధీరుడు.

అంతా చూస్తూ, అన్నీ వింటోన్న సుజనకి గుండె గుభిల్లుమంది. వాడు-ఆ గూండా-సర్వభక్షకుడు-తమ వీధిలోకి వచ్చాడన్న మాట! ఈ రోజు ఆ యువతి బలి అయింది. రేపు తనకి మూడదని నమ్మకమేమిటి? ముచ్చెమటలు పోశాయి. నిలువునా వణికింది.



గ్రామంలోకి సర్వభక్షకుడు ఎప్పుడొచ్చాడో, ఎలా వచ్చాడో, ఎవరికీ తెలియదు. అతడి చూపు ఎటు పడితే అటు నిలువునా బుగ్గి కావలసిందే! సమస్తమూ స్వాహా చేసి కాని వదలడు. గ్రామాధికారికి కుడిభుజంగా అయ్యాడు. గ్రామానికి రాక్షసుడయ్యాడు. గ్రామంలో ఎవరూ తన అధికారానికి ఎదురు చెప్పకుండా ఉండటానికీ, గ్రామంలో ప్రజల సంపదలు తన ఇష్టం వచ్చినట్లు రాజకీయాల పేరిట దోచుకోవటానికీ-గ్రామాధికారి సర్వభక్షకుడిని తనకు అండగా చేరదీశాడు. అతడిని రక్షకభటులుకానీ, రాజాధికారులుకానీ ఏమీ చెయ్యకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నాడు. తన అధికారానికి అడ్డులేకుండా ఉండాలి. తన సంపదలు రోజురోజుకీ పెరుగుతూ ఉండాలి. ఈ రెండు సాగుతున్నంతవరకూ, సర్వభక్షకుడు తన గ్రామంలో ఏం చేసినా గ్రామాధికారి పట్టించుకోడు. అంచేత ఆ గ్రామంలో విశృంఖలంగా తిరుగుతాడు సర్వభక్షకుడు. అతడు బాగా తాగుతాడు. ఆడదాన్ని చూస్తే వెఱ్ఱెత్తిపోతాడు. అందమైన ఆడది కనిపిస్తే చాలు, ఆమె కన్య అయినాసరే-అనుభవించకుండా ఒదిలిపెట్టడు. ఆమె ఇంట్లోనే, కుటుంబ సభ్యులకు తెలిసేలాగానే అనుభవిస్తాడు. సర్వభక్షకుడిని ఏమి చెయ్యలేక భర్త, అత్తమామలు భార్యని ఇంట్లోంచి వెళ్ళగొడుతున్నారు. అలా వెళ్ళగొట్టబడిన అభాగినులు కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరి కొందరు విధిలేక వేశ్యలుగా మారుతున్నారు. సర్వభక్షకుడిని ఎదిరించటానికి కొందరు యువకులు ప్రయత్నించకపోలేదు. వాళ్ళని నిర్దాక్షిణ్యంగా నరికి పారేశాడు సర్వభక్షకుడు. కొందరు అతడి మీద ఫిర్యాదులు చేశారు. గ్రామాధికారి విచారణ జరిపించేవాడు. చివరికి సర్వభక్షకుడు నిర్దోషి అని తేల్చేవాడు. ఫిర్యాదు చేసిన వాళ్ళనే శిక్షించే వాడు. సర్వభక్షకుడి పీడ భరించలేక గ్రామమంతా లోలోపల ఉడికిపోతోంది. మాహిష్మతీ నగర పాలిత ప్రాంతంలోది ఆ గ్రామం. మాహిష్మతీ నగరానికి రాజు నిషధుడు.



# రాజుగారి శాసనం

**- సి. ఆనందారామం**

** ** **

కెవ్వున కేక పెట్టింది సుజన.

విస్తుపోయాడు ప్రజామిత్రుడు.

"సుజనా! నేను. ఏమిటిది? భుజంమీద చెయ్యి వెయ్యగానే ఎందు కలా అరిచావ్?"

పీడకలలోంచి తెప్పరిల్లుతున్నట్లు రెప్ప లల్లార్చి చూసింది సుజన. 'నువ్వేనా?' అని దెయ్యాన్ని చూసిన పసిపిల్లలాగ అతడి భుజంమీద తల ఆనించింది. నిలువునా వణుకుతోంది. గుండె అదురుతోంది.

బుజ్జగింపుగా వెన్ను నిమురుతూ- "ఏం జరిగింది? ఎందు కింత భయపడుతున్నావ్?" అని అడిగాడు ప్రజామిత్రుడు.

"సర్వభక్షకుడు ఈ వీథిలోకి వచ్చాడు. రెండిళ్ళ అవతల జంభకుడి భార్యని..."భర్త భుజం మీద నుంచి తల ఎత్తకుండానే చెప్పింది సుజన. అతడి భుజం ఆమె కన్నీళ్ళతో తడిసిపోయింది.

పుంతమీది కుండలో నీళ్ళు సలసల మసులుతున్నాయి. అయినా, స్నానం చెయ్యాలనిపించలేదు మిత్రుడికి! ఎప్పటిలా అతడి వీపు రుద్దుతూ, ఉండుండి చన్నీళ్ళు మీద చిలకరిస్తూ చిలిపిగా అల్లరిచేస్తూ స్నానం చేయించే ఉత్సాహం లేకపోయింది సుజనలో! రకరకాల వంటకాలు వంటగదిలో ఉన్నాయి. అయినా, ఇద్దరిలో ఎవరికీ తినాలనిపించలేదు. ఒకరి పక్కన ఒకరు పడుకున్నారు, మౌనంగా!

ఇద్దర్లో ఎవరికీ నిద్ర రావటంలేదు.

"మిత్రా!" భర్తని కుదిపింది సుజన.

"చెప్పు!"

"నాకు రేపు తెల్లవారేలోగా విషం తెచ్చి పెట్టు!"

"విషమా? దేనికి?"

"ఇందాక జంభకుడు ఏమన్నాడో తెలుసా?... ఆడదానికి ప్రాణంకంటె శీలం ప్రధానం. సర్వభక్షకుడు నీ శీలం పాడుచెయ్యకముందే, నువ్వు చచ్చిపోతే బాగుండేది"అని! ఒకవేళ సర్వభక్షకుడు రేపు మనింటి మీదే పడితే, అప్పటి కప్పుడు ఎలా చావాలో నా కెలా తెలుస్తుందీ?"

మిత్రుడు భరించలేకపోయాడు. చప్పున సుజనని తనకి దగ్గరగా హత్తుకున్నాడు. అతడి గుండెలో తల దాచుకుని- "పోనీ, ఇప్పుడే నన్ను నువ్వే చంపేస్తావా? సర్వభక్షకుడి చేతుల్లో పడటం కంటె అదే నయం!" బేలగా అంది.

పడుకున్నవాడు దిగ్గున లేచాడు మిత్రుడు.

"ఎక్కడికి?" అడిగింది.

"ఇప్పుడే వస్తాను. తలుపేసుకో!"

"నేనూ వస్తాను."

"ఇంత రాత్రి..."

"పక్కన నువ్వుంటావు. ఒంటరిగా ఒక్క క్షణం కూడా ఉండలేను."

"రా!"

అర్ధరాత్రి దంపతు లిద్దరూ బయలుదేరారు. మిత్రుడు ఇంచుమించు ప్రతి ఇంటి తలుపూ తట్టి ఇలా చెప్పాడు-

"సర్వభక్షకుడి బారికి మన ఆడవాళ్ళని వదిలి మనం చేతులు ముడుచుకు కూచోవటం ఏమైనా బావుందా? అసలైన దోషిని ఏమీ చెయ్యలేక, మన స్త్రీలని మనమే బలిపెట్టుకుంటున్నాం! మన మంతా ఒకటయితే సర్వభక్షకుడు ఏం చెయ్యగలడూ? గ్రామాధికారి ఏం చెయ్యగలడూ?"

గ్రామంలో మూడొంతుల మంది మిత్రుడితో సహకరించలేదు. "అమ్మో! గ్రామాధికారితో తలపడి బతగ్గలమా? అతడికి బోలెడు డబ్బుంది. అతడి చేతి కింద రక్షకభటు లున్నారు. రాజాధికారులు అతడు చెప్పిందే వింటారు. సర్వభక్షకుడి అనుచరులు ఇంకా చాలామంది ఉన్నారు. ఇవన్నీ కాక, అవసర మనుకుంటే సేనని కూడా తెప్పించుకోగలడు. మనని పురుగుల్ని ఏరేసినట్టు ఏరేసి కాల రాసేస్తాడు" అన్నారు.

ఎన్నివిధాల నచ్చచెప్పినా వాళ్ళలో పిరికితనం పోలేదు. ఎలాగో పదిమంది యువకులుమాత్రం ముందుకొచ్చారు, మిత్రుడితో సహకరించటానికి.

వాళ్లకికూడా మిత్రుడిలాగే కొత్తగా పెళ్ళిళ్ళయ్యాయి. వారి భార్యలుకూడా వచ్చారు. అందరూ కాళికాదేవి గుళ్ళో సమావేశ మయ్యారు. చర్చలు ప్రారంభమయ్యాయి.

"నగరానికి రాజు నిషధుడు. అతడికి గ్రామాధికారి దుర్మార్గం తెలియజేస్తే పీడ వదులుతుంది."

"కానీ, తెలియజేసేది ఎలా? మళ్ళీ సాక్షులు, విచారణ అంటారుగదా! మన గ్రామాధికారి న్యాయ విచారణ ప్రహసనం తెలియని దెవరికి? ఆయన దగ్గర ఎలా కావాలంటే అలా సాక్ష్యం చెప్పటానికి ఎందరో సాక్షులు సిద్ధంగా ఉంటారు ఎప్పుడూ!"

"అదీగాక, గ్రామాధికారికి తెలీకుండా నగరానికి చేరుకుని నిషధరాజుకి విషయం తెలియజేసేది ఎలా?"

"మనం సర్వభక్షకుడిని బంధించాలి! రహస్యంగా అడవి దారుల వెంట నగరానికి తీసుకుపోయి, రాజు ముందు నిలబెట్టి విషయం వివరించాలి. అందరం వెళ్ళాలి. ఇంతమంది చేస్తోన్న ఆరోపణ రాజు కాదనలేడు!"

"పథకం బ్రహ్మాండంగా ఉంది. కానీ సర్వభక్షకుడిని మనం ఎలా బంధించగలం? అతడి దగ్గర కత్తులుంటాయి. వెంట పరివారం ఉంటుంది. వాళ్ళదగ్గరా ఆయుధా లుంటాయి. మనకి ఆయుధా లేవీ?"

"ఆయుధాలంటే కత్తులేనా? ఇనుప ఊచలు, వెదురు కర్రలు, కారంపొడి, ముళ్ళకంపలు-ఇవన్నీ ఆయుధాలుగా ఉపయోగించుకోవచ్చు."

"అయినా అల్లరి మొదలు కాగానే రక్షకభటులొస్తారు. ఆ రక్షకులూ, ఈ భక్షకుడు కలిసి మనని నమిలితింటారు."

"అల్లరి కాకూడదు. సర్వభక్షకుడు ఒక్కడూ రావాలి! ఆ సమయానికి మనమంతా సిద్ధంగా ఉండాలి."

"ఎలా సాధ్యం ఇదంతా?"

అంతా మౌనంలోపడ్డారు, కాసేపు.

ప్రజామిత్రుడు ఇలా అన్నాడు:"సుజనా! రేపు సర్వభక్షకుడు మన వీధిలోకి రాగానే అతడిని నువ్వే మన ఇంటికి ఆహ్వానించు. మేమంతా సిద్ధంగా ఉంటాం!"

"నేనా?" బెదిరింది సుజన.

"ఆడవాళ్ళమనీ, బయటికి రాకూడదనీ, అల్లరిపాలవుతామనీ మీరు సందేహిస్తే అనుకున్నది సాధించలేం? మీరంతా మాతో సహకరించవలసిందే!"

తర తరాలుగా వస్తోన్న అలవాటుకి భిన్నంగా ప్రవర్తించటానికి కొంత సంకోచించినా, చివరికి ఒప్పుకున్నారు ఆడవాళ్ళు. అవసరం ఆచారాలను మార్చేస్తుంది.

** ** **

సర్వభక్షకుడిని వెంటబెట్టుకుని అడవిదారి వెంట ప్రయాణం చేస్తున్నారు యువతీ యువకులు. సర్వభక్షకుడి కాళ్ళూ, చేతులూ బంధించారు. అతడి దగ్గిర ఆయుధాలు లేకుండా చేశారు. తమ దగ్గర ఆయుధాలు ఉంచుకున్నారు. అయినా, సర్వభక్షకుడు పెళ్ళికొడుకులా చిరునవ్వు నవ్వుతూనే ఉన్నాడు. మధ్యాహ్నం తీర్చుకోవటానికి చెట్టు కింద కూచున్నారు అందరూ! తాము తెచ్చుకున్న ఆహార పదార్థాలు తింటూ, సర్వభక్షకుడికి కూడా పెట్టారు.

వాటిని అందుకుని అతడు అన్నాడు-

"మీరింత మంచివాళ్ళు కాబట్టే మీరు సుఖంగా బతకలేరు!"

"ఇది మామంచితనం అనుకోకు! నిన్ను రాజుగారి దగ్గరికి సజీవంగా తీసుకుపోయి, గ్రామాధికారి చేస్తోన్న దుర్మార్గాలు రాజుగారి ముందు రుజువు చేయాలి. అందు కిస్తున్నాం ఆహారం!"

గట్టిగా నవ్వాడు సర్వభక్షకుడు.

"ఎందుకు నవ్వుతున్నావ్?"

"మీ అమాయకత్వానికి! మిమ్మల్ని చూస్తే జాలేస్తోంది. ఎంతో జాగ్రత్తగా పథకం ఆలోచించి నన్ను బంధించారు. అయినా, నన్నేం చెయ్యకుండా రాజుగారి దగ్గరికి తీసుకెళ్తున్నారు. మీ మంచితనానికి నా మనసు కరుగుతోంది. మనం రాజీకొద్దాం! నేను మీ వీధికి రాను ఇక మీదట! నేను రాకపోవటమే కాక, మిగిలిన వాళ్ళని కూడా రానీయను. పదండి... వెనక్కి పోదాం!"

"నీ జాలి మా కక్కర్లేదు. నువ్వెన్ని చెప్పినా, నిన్ను రాజుగారి ఎదుట ఉంచక మానం. విచారణ జరగక తప్పదు. ఈసారి నువ్వూ, నీ యజమాని గ్రామాధికారీ శిక్ష తప్పించుకోలేరు."

"మీ కర్మ!" తనలో తను అశ్లీల గీతాలు పాడుకుంటూ ఆనందించసాగాడు సర్వభక్షకుడు. అతడు నడవనని మొరాయిస్తే మిత్రుడికీ, అతడి మిత్రులకీ సర్వభక్షకుడిని తమ వెంట తీసుకెళ్ళటం కష్టమయి ఉండేది. కానీ, అతడు హుషారుగా నడవటమే కాక, మిత్ర బృందానికి కూడా ప్రోత్సాహమిచ్చాడు. దారిలో పులి ఎదురయితే, దానిని చంపటానికి సహాయం చేశాడు. ఒక సందర్భంలో అడవిలో దారి తప్పిపోబోతోంటే, సరి అయిన దారి చూపించాడు. చివరికి రాజధాని చేరుకునేసరికి, రాజు ముందు అతడిని దోషిగా నిలబెట్టటానికి కొందరు సంకోచించవలసి వచ్చింది. రాజు ముందు విచారణ ప్రారంభమయింది. సర్వభక్షకుడు చిరునవ్వుతో, తాను పరస్త్రీలను లోబరుచుకొంటున్నానని ఒప్పుకున్నాడు. మరునాడు సభలో న్యాయమూర్తులతో ఆలోచించి శిక్ష విధిస్తానని ప్రకటించాడు రాజు.

** ** **

గ్రామాధికారికి జరిగిన సమాచారం అందింది. గ్రామీణులలోనే ఎప్పటికప్పుడు ఏం జరుగుతోందో అతడికి తెలియజేసేవాళ్ళున్నారు. వాళ్ళకి గ్రామాధికారి బాగా బహుమానా లిస్తాడు. వెంటనే తన ముఠాను సమావేశపరిచి జరిగినదానికి ఏ విధంగా ప్రతిక్రియ చెయ్యాలో ఆలోచనలు జరిపాడు గ్రామాధికారి. ప్రత్యేకమైన శిల్పులతో, కేవలం తనకోసం తయారు చేయించుకున్న విమానం ఎక్కి బయలుదేరాడు. ఆ విమానం ఖరీదు కొన్ని కోట్లు. ఆ డబ్బంతా ప్రజలను దోచి సంపాదించుకొన్నదే! సరిగ్గా రాజు తీర్పు చెప్పబోయే ముందు ఉదయం రాజధాని చేరుకున్నాడు. రాజుని కలుసుకున్నాడు. రాజు ఏ సమయంలో అయినా ఈ గ్రామాధికారికి దర్శన మిస్తాడు. ఎందుకంటే, ఈ గ్రామాధికారి రాజుకి చాలా భారీగా కానుక లిస్తాడు.

ఎప్పటిలా రాజుకి కానుకలు సమర్పించి వంగి వంగి నమస్కారాలు చేసి, ఇలా విన్నవించుకున్నాడు గ్రామాధికారి: "ఈనాడు తమరు విచారణ జరిపించిన సర్వభక్షకుడు సామాన్యుడు కాడు. ఎవరినైనా క్షణాలలో బూడిద చెయ్యగలడు. మీకు ఎదురు తిరిగిన వాళ్ళ ఆనవాలు దొరక్కుండా చెయ్యగలడు. దేశంలో సంపద అంతా మీ పాదాల ముందు గుమ్మరించగలడు. అత డొక్కడే కాదు; అతడి పరివారం చాలా ఉంది. అందుచేత, తమరు శిక్ష విధించబోయే ముందు జాగ్రత్తగా ఆలోచించండి!"

నిషధ రాజు తెగ బాధపడిపోతూ, "ఇప్పుడెలా? అతడు నిండు సభలో తన నేరం ఒప్పుకున్నాడే?" అన్నాడు.

"ఫరవాలేదు. నే నొక మంచి ఆలోచన చెప్తాను" అన్నాడు గ్రామాధికారి.

అతడూ, నిషధ రాజూ కొంత సేపు మాట్లాడుకున్నారు.

** ** **

రాజ సభ సమావేశం కావటానికి ముందే రాజుగారి కొత్త శాసనం దేశమంతా చాటింపు వేశారు-

"ఈ దేశంలో ఏ మగవాడికయినా, ఏ ఆడదానితో నయినా సుఖపడే హక్కు ఉంది. స్త్రీలు స్వైరిణులు కావటం కానీ, పురుషులు పరస్త్రీలను అనుభవించటం కానీ ఈ దేశంలో దోషం కాదు."

ఈ వింత శాసనం విని దేశమంతా నివ్వెరపోయింది. సభ సమావేశ మయింది.

రాజు నిషధుడు న్యాయమూర్తులను సంప్రదించి ఇలా తీర్పు చెప్పాడు. "సర్వభక్షకుడు తన గ్రామంలో స్త్రీలను అనుభవించిన మాట నిజమే! కానీ, కొత్త శాసనం ప్రకారం అతడు చేసినది దోషం కాదు. కాబట్టి అతడు నిర్దోషి అని తీర్పు చెప్తున్నాం!"

** ** **

రగిలే గుండెతో, చెమర్చిన కళ్ళతో, పిడికిళ్ళు బిగించి నిలబడ్డ మిత్రవర్గాన్ని చూసి వెటకారంగా నవ్వాడు సర్వభక్షకుడు. "నేను ముందే హెచ్చరించాను. మీరు వినలేదు. ఈ దేశంలో నన్ను శిక్షించే దెవరూ? నిజానికి మీరంతా ఒకటయితే- మిమ్మల్ని నేనూ, గ్రామాధికారీ, రాజూ, ఎవరూ ఏమీ చెయ్యలేరు. కానీ, మీలో సగంమంది మధ్య తరగతి మనుష్యులు. 'మేమూ, మా కుటుంబమూ, మా ఉద్యోగాలూ బాగుంటే చాలు' అనుకుని దేశం విషయం పట్టించుకోరు. వ్యక్తి క్షేమం దేశ క్షేమంతో ముడిపడి ఉందని గ్రహించరు. మిగిలిన సామాన్యులలో ప్రతి వందమందిలోనూ ఇద్దరు, ముగ్గురైనా స్వార్థపరు లుంటారు. వాళ్ళని అధికారులు సునాయాసంగా కొనేసి, ఆ ఒకరిద్దరి సాయంతో వందమందిని అణగ దొక్కేస్తారు. అందుచేత మీకు విముక్తి లేదు. మాకు భయం లేదు. మీ క్షేమంకోరి ఒక సలహా చెప్తాను. నిజంగా తప్పు చేసిన నాకు భయం లేదు. కానీ, ఏ తప్పూ చెయ్యకపోయినా, మీరు భయపడాలి! ఎందుకంటే, గ్రామాధికారికి మీరంతా అతడికి వ్యతిరేకంగా పని చేస్తున్నారని తెలిసిపోయింది. మిమ్మల్ని బతకనివ్వడు. అందుచేత మీరు మళ్ళీ మన గ్రామానికి వెళ్ళకుండా, రహస్యంగా ఎక్కడైనా పారిపోండి!" రొమ్ము విరుచుకుంటూ సగర్వంగా గ్రామాధికారి సరసన విమానంలో గ్రామానికి తిరుగు ముఖం పట్టాడు సర్వభక్షకుడు!